క్లుప్తంగా

మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే కైలే పరామర్శ



తోట్లవల్లూరు: ఆపదలో ఉన్న వారికి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఎస్సీ వాడకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ఈడ్పుగంటి పెద సుబ్బారావు చిన్న కుమారుడు ఈడ్పుగంటి బాబూరావు(47) ఆదివారం మరణించారు. బాబూరావు మృతదేహాన్ని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సోమవారం సందర్శించి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ పెనుమత్స రాధిక, వైస్ ఎంపీపీలు కళ్లం శివారెడ్డి, మెల్లంపల్లి వెంకటేశ్వరరావు తదితరులు సంతాపం తెలిపారు.

ఈకేవైసీ పూర్తి చేయాలి

ముదినేపల్లి రూరల్: ఖరీఫ్ సీజన్‌లో మండలంలోని రైతులు పంటల వివరాలను ఈకేవైసీలో నమోదు చేయాలని వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ సూచించారు. పెదపాలపర్రు, చిగురుకోట రైతు భరోసా కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించి ఈక్రాప్ నమోదుపై వ్యవసాయ సహాయకులను ఆరా తీశారు. నమోదు ప్రక్రియను నెలాఖరు వరకు పొడిగించడంతో ప్రభుత్వ పథకాల విషయంలో రైతులు నష్టపోకుండా ప్రతిఒక్కరూ పంట నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పురుగుమందులు, ఎరువుల మందుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

గ్రామసభలను విజయవంతం చేయండి

మండవల్లి: గ్రామ పంచాయతీల్లో అక్టోబర్ 3 నుంచి జరగనున్న గ్రామ సభలను విజయవంతం చేయాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండల అధ్యక్షుడు టి.అప్పారావు కోరారు. ఈ మేరకు సోమవారం స్పందనలో ఎంపీడీఓ టీకే వెంకటరమణ, తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘ ప్రధాన కార్యదర్శి మార్కురాజు, బి.రంగారావు, పి.రామచంద్రరావు, కె.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవ సామాజిక బాధ్యత



గుడివాడ టౌన్: సమాజ సేవ పౌరుల సామాజిక బాధ్యతని ఏఎన్నార్ కళాశాల కరస్పాండెంట్ కె.ఎస్.అప్పారావు అన్నారు. స్థానిక ఏఎన్నార్ కళాశాల ప్రాంగణంలో సోమవారం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శ్రమదానం చేశారు. కళాశాల ప్రాంగణంలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి కొత్తగా మొక్కలు నాటారు. అప్పారావు మాట్లాడుతూ చిన్న వయసు నుంచే వ్యక్తిగత భద్రతతో పాటు సమాజ సేవను విద్యార్థులు అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీజీఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్లు ఎం.జీసుబాబు, ఎ.గ్రీష్మ, గ్రంథాలయ అధికారి బీఎస్ఎస్ పద్మజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనే లక్ష్యం



పామర్రు: ప్రజా సంక్షేమ పాలనే లక్ష్యమని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ తెలిపారు. మండల పరిషత్ ఏర్పడి రెండేళ్లు పూర్తైన సందర్భంగా స్థానిక కార్యాలయంలో సోమవారం వేడుకలు నిర్వహించారు. ఎంపీపీ దాసరి అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలను అందించడంలో ప్రజాప్రతినిధులు ముందుండాలన్నారు. గ్రామాల్లో అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు సేవలను అందించాలన్నారు. రెండేళ్లుగా మండలంలో అనేక సంక్షేమ అభివృద్ధి పనులు నిర్వహించామని చెప్పారు. అనంతరం కేక్ కోసి అభినందనలు తెలిపారు. వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, ఎంపీటీసీలు, ఎంపీడీవో వై.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ యజమానికి రూ. 5 వేల జరిమానా

తోట్లవల్లూరు: ఇసుక అక్రమ రవాణకు పాల్పడుతున్న ట్రాక్టర్ యజమానికి రూ. 5 వేల జరిమానా విధించినట్లు తహసీల్దార్ కుసుమకుమారి తెలిపారు. మండలంలోని రొయ్యూరు ఇసుక ర్యాంపు నుంచి ఇసుక అక్రమ రవాణకు పాల్పడుతున్న ట్రాక్టర్‌ను శనివారం రాత్రి రెవెన్యూ, పోలీసు సిబ్బంది పట్టుకున్నట్లు ఆమె తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు యత్నిస్తున్న ట్రాక్టర్ యజమాని నత్తా బాలాజీకి రూ. 5 వేల జరిమానా విధించామని కుసుమకుమారి చెప్పారు.

వక్రతుండ మహాకాయ..



శ్రీ గరిక గణపతిగా స్వామివారు



వీరంకిలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం



చినపారుపూడిలో గణనాథుడి నిమజ్జన ఊరేగింపు



పామర్రులో వినాయకుడిని పూజిస్తున్న భక్తులు

గుడివాడ టౌన్: బొజ్జ గణపయ్యకు భక్తి నీరాజనం అందుతోంది. వక్రతుండ మహాకాయ అంటూ భక్తజనం మనసారా ప్రార్థిస్తున్నారు. వినాయక చవితి వేడుకల్లో భాగంగా స్వామివారు ఎనిమిదవ రోజు సోమవారం వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో గణపతి నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని స్వామివారిని శ్రీ దూర్వ(గరిక) గణపతిగా అలంకరించారు.

గుడివాడరూరల్: మండలంలోని రామనపూడి, బిళ్లపాడు, చిన ఎరుకపాడు, తటివర్రు, మోటూరు, వలివర్తిపాడు, లింగవరం, దొండపాడు, గుంటాకోడూరు, చౌటపల్లి తదితర గ్రామాల్లో వినాయక చవితి వేడుకల్లో గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు.

నిమజ్జన కోలాహలం

పలుగ్రామాల్లో నిమజ్జన సందడి కనిపించింది. చౌటపల్లి, రామనపూడి, తటివర్రు గ్రామాల్లో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు విఘ్నేశ్వరుడి ప్రతిమను డీజే, డప్పు వాయిద్యాలతో పుర వీధుల్లో ఊరేగించారు. యువత, చిన్నారులు నృత్యాలు చేశారు. నిమజ్జనోత్సవాల సందర్భంగా మండలంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ ఎస్ఐ ఎల్ఎస్ఎన్ మూర్తి సిబ్బందితో ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: స్థానిక వై.కూడలిలోని చెక్ పోస్టు వద్ద నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అన్నసమారాధన జరిగింది. డెప్యూటీ తహసీల్దార్ మరియన్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు రెండు వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యులు మనోజ్, హనుమాన్, ఏఎన్ బాబు, బొబ్బిలి రత్తయ్యనాయుడు పాల్గొన్నారు.

2,500 మందికి అన్నప్రసాదం

మండవల్లి: స్థానిక శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద వినాయకచవితి ఉత్సవాలు ముగింపు సందర్భంగా సోమవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. మండవల్లి, గన్నవరం, కొర్లపాడు, పెరికెగూడెం తదితర గ్రామాల నుంచి సుమారు 2,500 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

చినపారుపూడి: గ్రామంలో సోమవారం వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో వినాయకుని విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఊరేగించారు. అనంతరం గ్రామానికి సమీపంలోని చంద్రయ్య కాలువలో నిమజ్జనం చేశారు. సర్పంచ్ నగుళ్ల శ్రీనివాసరావు, జాజుల నాగమల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పామర్రు: స్థానిక 13వ వార్డులో ఏర్పాటు చేసిన వినాయకస్వామిని ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గ్రామోత్సవం అంగరంగ వైభవంగా చేశారు. డప్పువాయిద్యాలతో, డీజే సౌండ్ సిస్టమ్స్‌లతో పిన్న, పెద్ద ఊరేగింపు నిర్వహించారు. పలుచోట్ల నుంచి వచ్చిన వినాయక విగ్రహాలను స్థానిక పుల్లేరు కాలువలో నిమజ్జనం చేశారు.

పమిడిముక్కల: వీరంకి గ్రామంలో 33వ వార్షికోత్సవంలో భాగంగా సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన స్వామి వారికి ఎనిమిది రోజులుగా విశేష పూజలు నిర్వహించారు.

బుధవారం స్వామి వారి ఊరేగింపు, గురువారం అన్నసంతర్పణ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పలు గ్రామాల్లో గణేష్ నిమజ్జనోత్సవాలు ఘనంగా నిర్వహించారు.

పామర్రు: స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో 31 అడుగుల మట్టి వినాయక విగ్రహానికి విశేష అర్చనలు చేశారు. స్థానిక బాపూజీపేటలోని వినాయక స్వామి ఆలయంలో పూజలు జరిగాయి. స్థానిక తోటలోని వినాయక స్వామి చలువ పందిరిలో పూజలను ఆలయ కమిటీ సభ్యులు చేశారు. జమీదగ్గుమిల్లి గ్రామంలోని వినాయక స్వామి ఆలయంలో భక్తులు రావూరి నాగమల్లేశ్వరరావు ఉమాదేవి దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాపర్ల, కురుమద్దాలి, కనుమూరు, అడ్డాడ, కొమరవోలులో వినాయక స్వామికి విశేషంగా పూజలు జరిగాయి.

మండవల్లి: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని కోదండ రామాలయంలో వరసిద్ధి వినాయకస్వామి ఆరో వార్షికోత్సవం ముగింపు సందర్భంగా స్వామివారి ఆరు కేజీల లడ్డూ ప్రసాదానికి సోమవారం సాయంత్రం వేలం నిర్వహించారు. గన్నవరం గ్రామానికి చెందిన కూనపురెడ్డి వీరబాబు రూ. 10,100కు లడ్డూను వేలంలో దక్కించుకున్నాడు. ఈ నెల 28వ తేదీ అఖండ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. అదే రోజు స్వామి వారి పూజలు అందుకున్న తొమ్మిది కేజీలు, 10 కేజీల లడ్డూ వేలం జరుగుతుందని పేర్కొన్నారు.

గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీ విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం లక్ష్మీ గణపతి హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 130 మంది దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ వీడీడీ ప్రసాద్ మాట్లాడుతూ లోక కల్యాణానికి, ప్రజలు ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని కోరుతూ హోమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఆలయ పాలక వర్గం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: నగరంలోని గణేష్ నవరాత్రి ఉత్సవాల పందిళ్ల వద్ద పూజలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పందిళ్లలోని స్వామివారి విగ్రహాల వద్ద పలు అలంకారాలు ఆకర్షణీయంగా చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పందిళ్ల వద్దకు భక్తులు చేరుకుని పూజలు చేశారు.

మండలాభివృద్ధికి కృషి

ఎంపీపీ గద్దె పుష్పరాణి



ఎంపీపీ,జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులతో మండల పరిషత్ అధికారులు, సిబ్బంది

గుడివాడరూరల్: ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) సహకారంతో రెండేళ్లలో మండలాభివృద్ధికి విశేష కృషి చేశానని మిగిలిన మూడు సంవత్సరాల్లో మరింత అభ్యున్నతికి పాటుపడతానని ఎంపీపీ గద్దె పుష్పరాణి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పాలకవర్గం ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, కో ఆప్షన్ సభ్యుడు బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం ఎంపీడీవో అనగాని వెంకటరమణ ఆధ్వర్యంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, మండల పరిషత్ అధికారులు, సిబ్బందిని ఘనంగా సత్కరించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఇప్పటికే మండలంలో స్వచ్ఛమైన తాగునీటిని ప్రజలకు అందించడానికి జలజీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు, తాగునీటి పైప్‌లైన్ల నిర్మాణం, ఓవర్‌హెడ్ ట్యాంక్ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపర్చడం, పలు సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు జెడ్పీ రహదారుల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ మాట్లాడుతూ గుడివాడ మండలాభివృద్ధికి ఎమ్మెల్యే కొడాలి నాని సహకారంతో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక నేతృత్వంలో నిధులు తీసుకువచ్చి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా వైఎస్సార్ సీపీ జెండాను ఎగరవేసి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పని చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు గుంజా వంశీధర్, భట్టు నాగమల్లీశ్వరి, కోఆప్షన్ సభ్యుడు సురేష్, ఈవోపీఆర్డీ వెంకటేశ్వరరావు, ఉపాధి హామీ ఏపీఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి 'స్పందన'



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ మురళీకృష్ణ

గుడివాడ టౌన్: ప్రజా సమస్యల పరిష్కారానికి స్పందన ఏర్పాటుచేశారని అధికారులు తెలిపారు. గుడివాడ ఆర్డీఓ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయాల్లో సోమవారం స్పందన జరిగింది. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బొమ్ములూరుకు చెందిన ఓ ఫిర్యాదుదారుడు పాస్‌బుక్‌లో సర్వే నంబర్లు మారాయి వాటిని సరిచేయాలని, మోటూరుకు చెందిన ఫిర్యాదుదారుడు బంటుమిల్లి రోడ్డులో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించడానికి చర్యలు తీసుకోవాలని, పట్టణానికి చెందిన ఓ వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతున్నాం ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం ఇప్పించాలని దరఖాస్తులు చేసుకున్నారు. పురపాలక సంఘ కార్యాలయానికి సంబంధించి చెంచు కాలనీకి చెందిన తోట శ్రీ రామాంజనేయులు పింఛన్ నిలిపారని దాన్ని పునరుద్ధరించాలని, స్థానిక కేటీఆర్ కళాశాల వద్ద నివాస ప్రాంతాల్లో చికెన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నారు చర్యలు తీసుకోవాలని, మరో వ్యక్తి తన కుమారుడికి వివాహమైన కారణంగా ఇంటిస్థలం ఇప్పించాలని దరఖాస్తు చేసుకున్నారు. ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ పి.పద్మావతి, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వి.మురళీకృష్ణ దరఖాస్తులు స్వీకరించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది భర్తీకి నోటిఫికేషన్

మొవ్వ: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మొవ్వ, ఘంటసాల, చల్లపల్లి మండలాల్లోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సీడీపీవో పి.భానుమతి వెల్లడించారు. మొవ్వ మండలం మంత్రిపాలెం-2 కేంద్రంలో కార్యకర్త(ఎస్సీ), పెదపూడి-4వ కేంద్రంలో సహాయకురాలు(బీసీ-బీ), ఘంటసాల మండలం ఘంటసాల కేంద్రం-1లో సహాయకురాలు(ఓసీ), చల్లపల్లి మండలం చల్లపల్లి కేంద్రం-2లో సహాయకురాలు(ఓసీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు విడుదల చేసినట్లు వివరించారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి స్థానిక మహిళలు అర్హులని, అభ్యర్థులు అక్టోబర్ 5వ తేదీ సాయంత్రంలోపు దరఖాస్తులను మొవ్వ సీడీపీవో కార్యాలయంలో అందించాలని తెలిపారు.

పెదపారుపూడి: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం. శివనాగమణి సోమవారం తెలిపారు. మండలంలోని మహేశ్వరపురంలో సహాయకురాలు పోస్టుకు ఎస్సీ, యలమర్రు-2 సెంటర్‌నుంచి ఓసీ, వెంట్రప్రగడ-7 (లక్ష్మీపురం) నుంచి మైనార్టీ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 23 నుంచి 35 సంవత్సరాల్లోపు అభ్యర్థులు దరఖాస్తులను పామర్రులోని సీడీపీవో కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

పమిడిముక్కల: గుర్రాల్లంక అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని పామర్రు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి వి.భానుశ్రీ కోరారు. ఈ పోస్టును ఓపెన్ కేటగిరీ(ఓసీ)లకు కేటాయించినట్లు చెప్పారు. దరఖాస్తులను వచ్చే నెల 4వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు పామర్రు ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

రూ.3.96 లక్షల జరిమానా



ముదినేపల్లి మండలంలో విద్యుత్ తీగలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

కైకలూరు: విద్యుత్ చౌర్యం సామాజిక నేరంగా పరిగణించి కేసులు నమోదు చేస్తామని విద్యుత్‌శాఖ విజిలెన్సు సీఐ గంగాభవాని, ఎస్సై వెంకటేశ్వరరావు హెచ్చరించారు. విజిలెన్స్ ఎస్ఈ అల్ఫాన్స్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని కైకలూరు, ముదినేపల్లి సెక్షన్ల పరిధిలో విజిలెన్స్ ఈఈలు కె.వెంకటేశ్వర్లు, కమలకుమారి ఆధ్వర్యంలో సోమవారం రెండు బృందాలుగా విద్యుత్ మీటర్ల తనిఖీలు చేశారు. గృహాలు, వాణిజ్య సముదాయాలు, ఆక్వా చెరువులపై విద్యుత్ మీటర్లను తనిఖీ చేయగా 36 సర్వీసులకు అదనపు లోడు వినియోగించినందుకు రూ.3 లక్షలు, బ్యాక్ బిల్లింగ్ చేసినందుకు రూ.70 వేలు, మాల్ ప్రాక్టీసెస్ చేసిన వినియోగదారులకు రూ.26 వేలు వెరసి రూ.3.96 లక్షల జరిమానాలు విధించారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ చౌర్యం జరిగినట్లు గమనిస్తే 94408 12362, 94408 12363, 83310 14951 సెల్ నంబర్లకు సమాచారం అందించాలని విజిలెన్స్ అధికారులు కోరారు. విద్యుత్ తనిఖీల్లో డీపీఈ ఏడీఈలు నవీన్, ఎస్ఎం.ప్రసాద్, డీపీఈ ఏఈలు పాల్గొన్నారు.

విజయదుర్గమ్మ ఆలయంలో రాటా ఏర్పాటు



గుడివాడ టౌన్: స్థానిక నీలామహల్ రోడ్డులోని శ్రీ విజయదుర్గమ్మ దేవస్థానంలో సోమవారం పాలకమండలి సభ్యులు రాటా ఏర్పాటు చేశారు. దేవీశరన్నవరాత్రి మహోత్సవాల ఏర్పాటులో భాగంగా పసుపు కొట్టి రాటా ఏర్పాటు చేశారు. ఆలయ అర్చకుడు పునీత్ శర్మ మాట్లాడుతూ అక్టోబర్‌లో శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నామని పనులు ప్రారంభం సమయంలో శుభసూచకంగా రాటా ఏర్పాటు పూజలు నిర్వహిస్తామన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ నయనవరపు శేషుబాబు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ర్యాలీ

మండవల్లి: మండవల్లి ఎంపీపీ స్కూల్-2లో ఆజాదీకా అమృతోత్సవ కార్యక్రమం ర్యాలీ సోమవారం నిర్వహించారు. ఉపాధ్యాయుడు సీహెచ్ పిచ్చోడు మాట్లాడుతూ దేశ నాయకుల ఆశయాలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. రేపటి పౌరుల ఎదుగుదలకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చెప్పారు. ఉపాధ్యాయిని జయశ్రీ పాల్గొన్నారు.

కాఫీ విత్ క్లాప్ మిత్ర

మండవల్లి: స్వచ్ఛతా హీ సేవలో భాగంగా సోమవారం మండవల్లిలో కాఫీ విత్ క్లాప్ మిత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సీకే వెంకటరమణ, సర్పంచ్ మెండా ఝాన్సీ, ఈఓపీఆర్డీ బి.ఆనందబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్, కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

460 మందికి వైద్య పరీక్షలు



కైకలూరులో సీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే సతీమణి వీరకుమారి

కైకలూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో కైకలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)లో సోమవారం జరిగిన ఆయుష్మాన్‌భవ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) సతీమణి వీర కుమారి శిబిరాన్ని ప్రారంభించారు. నియోజకవర్గ ప్రజలు ఇటువంటి ప్రత్యేక వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యులు ప్రసూతి, శస్త్ర చికిత్స, గుండె వ్యాధులు, సాధారణ, నేత్ర, దంత, చెవి, ముక్కు, గొంతు పరీక్షలు చేశారు. సమీప ప్రాంతాల నుంచి 460 మంది వివిధ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యులు దూలం వీర శ్యామ్ ఫణికుమార్ క్యాంపు నిర్వహణ పనులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, ఎంపీటీసీ మంగినేని రామకృష్ణ, సర్పంచుల సంఘ మండలాధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, వైద్యులు శ్రీనివాసరావు, కీర్తి, రమ్య, గీతాంజలి, అనుపమ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యువజనోత్సవాల్లో విద్యార్థుల ప్రతిభ



విజేతలతో విద్యాలయ ప్రిన్సిపాల్ విజయభాస్కర్



ప్రతిభ చూపిన గౌతమ్ హైస్కూల్ విద్యార్థులు

గుడివాడ టౌన్: రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ యువజనోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన వివిధ పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ఇతర బహుమతులు గెలుచుకున్నట్లు విద్యాలయ పాఠశాల ప్రిన్సిపాల్ బొప్పన వెంకట విజయ భాస్కర్ తెలిపారు. వక్తృత్వ, ఫ్యాన్సీ డ్రస్, క్లాసికల్ డాన్స్, వ్యాసరచన, చిత్రలేఖనం, బృందనృత్యం పోటీలలో సీనియర్, జూనియర్ విభాగాల్లో మొత్తం 10 బహుమతులు గెలుచుకున్నట్లు ఆయన వివరించారు. విద్యార్థులను సోమవారం పాఠశాలలో డైరెక్టర్ శాంతి, ఉపాధ్యాయులు అభినందించారు.

గుడివాడ టౌన్: యువజనోత్సవాల్లో 'గౌతమ్' విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సత్యారామ్ సోమవారం తెలిపారు. వ్యాసరచనలో 2, వక్తృత్వ పోటీలో 2, క్విజ్ పోటీలో 1, స్పెల్–బీ 2, ఫ్యాన్సీడ్రెస్ 1, క్లాసికల్ గ్రూప్ డ్యాన్స్ 3, జానపద నృత్యం 1, క్లాసికల్ డయ్యాన్స్ 2, క్లాసికల్ సాంగ్స్ సోలో 2, స్పాట్ పెయింటింగ్ 4 బహుమతులు సాధించినట్లు వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాలలో సోమవారం ప్రిన్సిపాల్స్ లక్ష్మీప్రసాద్, కె.జ్యోతి, జబ్రీనా, ఉపాధ్యాయులు అభినందించారు.

శ్యామలాంబ దేవస్థానంలో దసరా పనులు ప్రారంభం



కైకలూరు శ్యామలాంబ దేవస్థానంలో దసరా మహోత్సవాల రాటా(కర్ర) కార్యక్రమం

కైకలూరు: స్థానిక శ్యామలాంబ దేవస్థానంలో అక్టోబరు 10 నుంచి 24వ వరకు జరిగే చండీ మహాయాగ సహిత దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సోమవారం పందిరిరాట కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) సతీమణి వీర కుమారి, కుమారుడు వీర శ్యామ్ ఫణికుమార్, ఎంపీపీ అడవి కృష్ణ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. నూతన లడ్డూ కౌంటర్‌ను ప్రారంభించారు. నంబూరి ప్రతాపరాజు దంపతులు రాటా(కర్ర) పూజలు చేశారు. దేవాలయ ఈవో వీఎన్‌కే శేఖర్ మాట్లాడుతూ దసరా మహోత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గుర్రం రాంబాబు, ధర్మకర్తలు కురేళ్ల మురళీకృష్ణ, బుర్ల సత్యనారాయణ, తులసి శ్యామలాగౌరి, మద్దూరి పద్మ, గొల్లపల్లి ఉమాశాంతి, పైయెద్దు బేబి, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, ఎంపీటీసీ మంగినేని రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు పంజా రాంబాబు, జంపన రాము, మద్దాల పద్మ తదితరులు పాల్గొన్నారు.

రోగులను ప్రేమతో పలకరించండి

ఎంపీపీ అడవి కృష్ణ



శీతనపల్లి పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీపీ అడవి కృష్ణ

కైకలూరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వైద్య సేవలు నిమిత్తం వస్తున్న రోగులను ప్రేమతో పలకరించాలని ఎంపీపీ అడవి కృష్ణ చెప్పారు. చైర్మన్ హోదాలో కృష్ణ సోమవారం శీతనపల్లి పీహెచ్‌సీని సందర్శించారు. రోగులతో స్వయంగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యరంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.కోట్లలో నిధులు కేటాయించి, మౌలిక వసతులు, వైద్య సిబ్బందిని నియమించారన్నారు. ఈ నెల 30 నుంచి జరిగే వైఎస్సార్ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై డాక్టర్లు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బందితో మంగళవారం సాయంత్రం 4 గంటలకు కైకలూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు హేమలత, అన్నపూర్ణ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు రూ.2.50 లక్షల సోలార్ యంత్రం బహూకరణ



కైకలూరు(కలిదిండి): పాఠశాల అభివృద్ధికి దాతల సాయం అభినందనీయమని ఆరుతెగళపాడు ప్రధానోపాధ్యాయుడు ఎ.శ్రీనివాస్ అన్నారు. రాచపట్నం గ్రామానికి చెందిన విశ్రాంత డీఎస్పీ ముసునూరి రవీంద్రనాథ్ ఠాగూర్ రూ.2.50 లక్షల విలువ చేసే సోలార్ విద్యుత్ యంత్రాన్ని పాఠశాలకు సోమవారం బహూకరించారు. అనంతరం వివిధ సందర్భాల్లో పాఠశాల అభివృద్ధికి సాయం చేసిన దాతలు ఠాగూర్, ఎ.వెంకన్న, పి.దొరబాబు, ఎ.శ్రీరాములు, టి.జగన్, పి.శివలింగేశ్వరరావు, పి.రామకృష్ణ, పి.శేఖర్‌బాబు, జి.సురేష్, జె.విజయ్‌కుమార్‌ను పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో సర్పంచ్ పి.స్వర్ణకుమారి, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు మాగంటి శ్రీమన్నారాయణమూర్తి, వల్లభనేని శ్రీనివాసచౌదరి, తోకల సింగారయ్య, ఎస్ఎంసీ చైర్మన్ ఎం.స్వరూపరాణి, ఉప సర్పంచ్ పి.రాజాబాబు పాల్గొన్నారు.